సర్కారు బడులకు మరిన్ని హంగులు

- ఏలూరు నియోజకవర్గంలో 63 పాఠశాలలకు మహర్దశ..
- మన బడి నాడు – నేడు రెండవ విడతకు ఎంపిక
- కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఇప్పటి వరకూ రూ. 4.68 కోట్ల పనులు పూర్తి



గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో శ్లాబ్ పనులు జరుగుతున్న దృశ్యం



నాడు - నేడు పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో అత్యంత ఆధునిక వసతులతో తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం స్వాగతం పలకనున్నాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్ తన భుజస్కంధాలపైకి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మన బడి నాడు – నేడు కార్యక్రమం ద్వారా మొదటి విడతలో ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యంత ఆధునిక వసతులతో కూడిన పాఠశాలలను విద్యార్థులకు అంకితం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సౌకర్యాలను తలదన్నే రీతిలో అభివృద్ధి చేయడంతో పేద మధ్యతరగతి విద్యార్థుల అడుగులన్నీ ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపే పడుతున్నాయి. గతంలో తమకు భారమౌతున్నా వేలకువేలు ఫీజుల రూపంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు ధారపోసి బిడ్డలకు చదువులు చెప్పించిన తల్లిదండ్రులకు జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి ఏర్పాటు చేశారు.

ఏలూరు నియోజకవర్గంలో 63 పాఠశాలల ఎంపిక..

మన బడి నాడు – నేడు కార్యక్రమం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం ఏలూరు నియోజకవర్గంలో రెండవ విడతలో 63 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో అదనపు తరగతి గదులు, సుందరమైన ప్రాంగణాలు, ప్రహరీ గోడలు, సౌకర్యవంతమైన మరుగుదొడ్లు, గ్రీన్ చాక్ బోర్డులు, ఆధునిక బల్లలు, రంగురంగుల గోడలు, విద్యార్థుల సౌకర్యం కోసం తరగతి గదుల్లో ట్యూబ్‌లైట్ వెలుగులు, చల్లని గాలి కోసం ఫ్యాన్లు ఇలా చెప్పుకుంటూ పోతే మన బడి నాడు – నేడుతో పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. ఈ విషయాన్ని మొదటి విడతలో అభివృద్ధి చేసిన పాఠశాలలు స్పష్టంగా కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎంపికైన పాఠశాలల్లో ఏలూరు నగర పరిధిలో 31 ఉండగా గ్రామీణ పరిధిలో 32 పాఠశాలలు ఉన్నాయి.

ఇప్పటి వరకూ రూ. 4.68 కోట్ల పనులు పూర్తి..

రెండవ విడత నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో ఇప్పటి వరకూ రూ. 4.68 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. వీటిలో శ్లాబ్‌లు, పిల్లర్లు, టైల్స్ పనులు, చిన్న,పెద్ద మరమ్మతు పనులు, పై అంతస్తుకు శ్లాబ్ పనులు, ప్రహరీ గోడ పనులు పూర్తి చేశారు. కాగా ఏలూరు నగర ప్రాంతంలోని పాఠశాలల్లో ఇప్పటి వరకూ 2.39 కోట్ల విలువైన పనులు జరుగగా, గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలల్లో రూ. 2.29 కోట్ల విలువైన పనులు పూర్తి అయ్యాయి. ఈ పాఠశాలలకు సంబంధించి పూర్తి పనులను వేసవి సెలవుల్లో ముగించి వచ్చే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలనేది విద్యాశాఖాధికారుల ఆలోచన.

విద్యార్థులకు ఆహ్లాదకర విద్య..



గతంలో తరగతి గదులకు, ఇప్పటి తరగతి గదులకు ఉన్న తేడాను విద్యార్థులు స్పష్టంగా గమనిస్తున్నారు. నాడు – నేడుతో అభివృద్ధి చెందిన తరగతి గదులు విద్యార్థులకు నూతన అనుభూతినిస్తున్నాయి. గాలి వెలుతురు సరిగా లేని తరగతి గదుల నుంచి పూర్తి స్థాయి సౌకర్యవంతమైన తరగతి గదుల్లోకి మారడంతో విద్యార్థులకు ఆహ్లాదకర విద్య అందుతున్నట్టే. ఇటువంటి తరగతి గదుల్లో విద్యాభ్యాసాన్ని విద్యార్థులు ఆస్వాదిస్తున్నారు.

జీజేపీ స్టీవెన్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు.

నాణ్యతలో రాజీ లేకుండా..



ఏలూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన మన బడి నాడు – నేడు కార్యక్రమం పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయించడానికి ప్రధానోపాధ్యాయులు, అధికారులు కృషి చేస్తున్నారు. ఆయా పనులను దగ్గర ఉండి పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ ఆశయాన్ని తరతరాలకు తెలిసేలా నాడు – నేడు పనులు పూర్తి చేస్తాం. మొత్తం మీద ఏలూరు నియోజకవర్గంలో రెండవ విడతలో సుమారు రూ. 25 కోట్లతో నాడు – నేడు పనులు జరుగుతున్నాయి.

సబ్బితి నరసింహ మూర్తి, మండల విద్యాశాఖాధికారి ఏలూరు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



జిల్లా విద్యాశాఖాధికారి రవి సాగర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవి సాగర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఈ నెల 28వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయని, అయితే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి మాత్రం 28వ తేదీ నాటికి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం ముగించి మరుసటి రోజున తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రోగ్రెస్‌కార్డులు ఇవ్వాలని ఆదేశించడం సబబు కాదన్నారు. పరీక్షలు ముగిసిన రోజునే మూల్యాంకనం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. విద్యాకానుక కింద విద్యార్థులకు అందచేస్తున్న 9 రకాల వస్తువులను, 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలనీ ఒకే విడతలో పాఠశాలలకు నేరుగా చేరవేయాలని కోరారు. ఎస్ఎస్సీ పరీక్ష మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి పెంచిన పారితోషికాలు చెల్లించాలని కోరారు. విద్యాశాఖాధికారిని కలిసిన వారిలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు తదితరులున్నారు.

క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఆదర్శనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటి మేయర్

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఏలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. బుధవారం ఆయన సత్రంపాడు శాంతినగర్, ఆదర్శనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల,మత, వర్గ, పార్టీ చూడకుండా అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హాయాంలో పథకం పొందాలంటే పేదలు ప్రజాప్రతినిధులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని గుర్తు చేసారు. ఇప్పుడు వైఎస్సార్ ప్రభుత్వ హాయాంలో అర్హత కలిగిన వ్యక్తి నేరుగా సచివాలయంకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇలాంటి పారదర్శక పాలన గతంలో ప్రజలు ఎన్నడూ చవి చూడలేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మరోసారి జగన్మోహన్‌రెడ్డికే పట్టం కడతారని నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు అనిల్‌కుమార్, వలంటీర్లు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

పెదవేగి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు ఎక్కువ సమయం పనిచేసి అధిక వేతనం పొందాలని పెదవేగి ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. బుధవారం మండలంలోని జానంపేటలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు రూ 272 వరకూ పొందవచ్చని తెలిపారు. పని ప్రదేశానికి అందరూ పనిముట్లతో రావాలన్నారు. ఉపాధి పని జరిగే ప్రాంతంలో కూలీలకు తాగునీరు ప్రాథమిక చికిత్స కిట్‌లు, నీడ కోసం టెంట్లు సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు.

ఫైలేరియా రోగులకు కిట్లు అందజేత

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమకాటుకు దూరంగా ఉండే మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో 106 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందజేసిన కిట్లను పంపిణీ చేశారు.

పార్కు అభివృద్ధి పనులను 15 రోజుల్లో పూర్తిచేయాలి



జన్మభూమి పార్కును సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): నగరంలోని విజయా డైయిరీ సమీపంలో తమ్మిలేరుకు ఆనుకొనియున్న జన్మభూమి పార్కు సుందరీకరణ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమీషనరు, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం స్థానిక జన్మభూమి పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ అధికారులతో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు.పార్కు సుందరీకరణకు సంబంధించి అన్ని మరమ్మతులు, అభివృద్ధి పనులు పూర్తిచేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏలూరు నగర ప్రజలందరూ వారి కుటుంబ సభ్యులతో ఈ పార్కుకు వచ్చి ఆనందించేలాగా తీర్చిదిద్దాలన్నారు. అదే విధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్ని పార్కులు కూడా ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనరు సంక్రాంతి వెంకటకృష్ణ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ భాస్కరరావు, డీఈలు కొండలరావు, సత్యనారాయణ, తాతాబ్బాయి, ఏఇలు రామారావు, రాఘవులు ఉన్నారు.

నిందితుడికి కరోనా పాజిటివ్

ఏలూరు టౌన్: పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామం ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు అనుదీప్‌కు వైద్య పరీక్షల్లో కరోనా పాజిటివ్ అని తేలడంతో పోలీసులు ఆందోళనకు గురయ్యారు. నిందితుడిని 24 గంటల్లోపే అరెస్టు చేసిన పోలీసులు జైలుకు తరలించేందుకు వైద్య పరీక్షలు చేయించగా కరోనా పాజిటివ్‌గా తేలింది. నిందితుడ్ని ఏలూరు ప్రభుత్వ బోధనా ఆస్పత్రిలో ఖైదీల వార్డులో చికిత్స నిమిత్తం ఉంచారు. ఇక అతన్ని అరెస్ట్ చేసిన పోలీసులు, వాంగ్మూలం నమోదు చేసిన అధికారులు కరోనా పరీక్షలు చేయించుకున్నారు. పోలీస్ అధికారులు సిబ్బందికి కరోనా నెగిటివ్ అని నిర్ధారణ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాధితురాలు విద్యార్థినికి బుధవారం మధ్యాహ్నం కరోనా పరీక్ష నిర్వహించారు. పరీక్ష ఫలితం తెలియాల్సి ఉంది

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి



10వ తరగతి మూల్యాంకన కేంద్రం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను అక్రమంగా సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని సమాజంలో తక్కువ చేసి చూపించే విధంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో స్థానిక గ్జేవియర్ పాఠశాలలోని 10వ తరగతి స్పాట్ కేంద్రం వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏలూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ అధ్యక్షత వహించి, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని, అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ జీ.వెంకటేశ్వరరావు, కో చైర్మన్ ఎం.ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులు బీ. రెడ్డి దొర, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవికుమార్, డీవీ రమణ, జీ. కృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్, టీ.రామారావు, ఎస్టీయూ టౌన్ ప్రెసిడెంట్ ఏ. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఏలూరు టౌన్: రేషన్ బియ్యాన్ని ఒక వ్యక్తి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నారు. పెదపాడు మండలం కొత్తూరుకు చెందిన ఇసుపల్లి వెంకటరమణ, సత్యనారాయణ రెండు వేల కేజీల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ అతన్ని అరెస్టు చేశారు. ఆటోను, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ



మేడే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ శ్రామిక దినోత్సవం 137 మేడే సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మేడేను జయప్రదం చేయాలని, కార్మిక హక్కులను కాపాడేందుకు పోరాడాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. కార్మిక వర్గం తర తరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు, రాయితీలను మోదీ–షాల ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగులేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేశారని విమర్శించారు. మేడే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ నూకరాజు, పల్లి గంగరాజు,కోరాడ అప్పారావు, ధన్నాన విజయ్, చల్లా శ్రీను, బండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్వాహనోత్సవం



వేంకటేశ్వర స్వామి వారికి హనుమద్వాహనోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి హనుమద్వాహనోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూల మంత్ర హవనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ధనధాన్యాభివృద్ధ్యర్థం శ్రీ మహాలక్ష్మీ హోమం నిర్వహించి మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి హనుమద్వాహనోత్సవం నిర్వహించి మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05–08
బెండకాయలు	24	కంద	58
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	40–44	కీరా దోస	34
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	46	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	60
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34

మేడేను జయప్రదం చేయాలి



ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.నిత్యవసర ధరలను అదుపు చేయాలని, ఆటో కొనుగోలుకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. రవాణా రంగ కార్మికులకు కేరళ తరహా సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, 46వ లేబర్ కమిషన్ సిఫార్సులకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అప్పనవీడు ఆటో డ్రైవర్లు 60 మంది సిఐటియూ ఆధ్వర్యంలోని ఆటో యూనియన్‌లో చేరడాన్ని ఆయన స్వాగతించారు. యూనియన్ నాయకులు బుద్దా సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ జిల్లాప్రధాన కార్యదర్శి జె.గోపి, ఏలూరు నగర అధ్యక్షులు చక్రాల అమర్ కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎం.ఇస్సాక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న గోపన్నపాలెం సర్పంచ్

దెందులూరు: గోపన్నపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులందరూ గతంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసి పాఠశాలకు వచ్చేదారి వర్షం వస్తే బురద మయమై రాకపోకలకు ఇబ్బందిగాఉందని చెప్పారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో కొండేటి నాగే శ్వరరావు ఇంటి నుంచి ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును బుధ వారం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పంచాయతీ కోఆప్షన్ మెంబర్, వైఎస్సార్ సీపీ నేత కామా కుమార్‌బాబు, కార్యదర్శి యహోషువా పరిశీలించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఉంగుటూరు: రాజమహేంద్రవరం వేద స్పైన్ సెంటర్ ఆసుపత్రి డాక్టరు తేజోఫణీంద్ర, డాక్టర్ లక్ష్మీ మృదుల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో ఉచితంగా వెన్నుపూస, ఎముకలు, స్త్రీల వైద్యంపై ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచి బండారు సింధు అధ్యక్షత వహించారు. సభలో వాసుబాబు మాట్లాడుతూ వేద స్పైన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేసి పేదలకు ఉపయోగపడటం మంచి పరిణామమన్నారు. వెన్నుపూస వైద్య నిపుణుడు మన ఉంగుటూరు గ్రామ వాసి కావడం గర్వంగా ఉందని వాసుబాబు అన్నారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడమంగరావు, వీవర్సు జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, పాల్గొన్నారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు.

ఇంట్లో చోరీ

ఏలూరు టౌన్: ఇంటికి తాళం వేసి దైవ దర్శనానికి వెళ్లి వచ్చేటప్పటికీ దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు వస్తువులు అపహరించుకుపోయారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటన సంబంధించిన వివరాలు ఏలూరు తంగెళ్ళమూడి సాంబశివ బార్ సమీపంలో నివాసం ఉంటున్న బైరెడ్డి దమయంతి తన కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లి తిరిగి వచ్చేటప్పటికీ ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని, బీరువాలో ఉన్న బంగారు వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఏలూరు ప్రభుత్వబోధనాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మస్యం శ్రీనివాసరావు (45) భార్య, పిల్లలున్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 25వ తేదిన మోటారు సైకిల్‌పై ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బొర్రంపాలెం అడ్డగట్ట వద్ద టాటా ఏసీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన శ్రీనివాసరావు ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై టీ.నర్సాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.